అంగరంగ వైభవంగా వెంకన్న తిరువీధి

- గోవింద నామస్మరణతో మార్మోగిన వెంకన్న సన్నిధి
- స్వామి, అమ్మవార్లకు విశేష హారతులు
- నేడు బల్లిగిరి పరస మహోత్సవం


కనకమహాలక్ష్మి దేవస్థానంలో వేసిన వేంకటేశ్వరస్వామి ముగ్గు


శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరువీధిలో పాల్గొన్న భక్తులు


విద్యుత్ దీపాలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం

అల్లిపురం : బల్లిగిరి శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో అధిష్టింపజేసి మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయం నుంచి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు బుద్ధ గోపాలకృష్ణ, కె.శివ సంతోష్‌కుమార్, తాడి అనురాధ, వలిశెట్టి లక్ష్మి, ఒమ్మి హరి, బొడ్డేటి కిషోర్, కొల్లి సత్యవతి, పాత్రేటి శివ కుమార్, పీలా రవి చంద్రశేఖర్, అధిక సంఖ్యలో భక్తులు ఊరేగించారు. ఈ సందర్భంగా బల్లిగిరి గోవింద నామస్మరణతో మార్మోగింది. తిరువీధిలో ప్రజలు స్వామికి అడుగడుగునా హారతులిచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామి ఇరువురు దేవేరిలతో కలిసి ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం స్వామికి ఆలయ అర్చకులు విశేషంగా పంచహారతి, నక్షత్ర హారతి, కుంభ హారతులతో విశేష హారతులిచ్చారు.

నేడు పరస మహోత్సవం..

బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక పరస మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి భక్తుల దర్శనాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సాయంత్రం దేవాలయం పరిసరాలతో పాటు అల్లిపురం వీధులన్నీ చిరు దుకాణాలతో సందడిగా ఉంటుందని, భక్తులు, బంధువులు అధికంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.


అల్లిపురం కుమ్మరి వీధిలో భజన చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు


దొండపర్తి కుప్పిలివారి వీధిలో భజన చెట్టుకు పూజలు చేస్తున్న స్థానికులు

భక్తిశ్రద్ధలతో భజన చెట్టుకు పూజలు..

అల్లిపురం : సంక్రాంతి సందర్భంగా అల్లిపురం కుమ్మరవీధిలో గల శ్రీ రామాలయం వద్ద ఘనంగా పూజలు నిర్వహించారు. పురాతన సాంప్రదాయాన్ని అల్లిపురం వాసులు కొనసాగిస్తున్నారు. పల్లెల్లో కనిపించే భజన చెట్టు పూజ (చమురు కాల్చడం)ను సంక్రాంతి సాయంత్రం వైభవంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పాటలు పాడుతూ భజన చెట్టు చుట్టూ చేరి భజనలు చేపట్టారు. దీంతో కుమ్మరవీధి రామాలయం వద్ద సోమవారం సాయంత్రం సందడి నెలకొంది.

30వ వార్డు సాలిపేటలో..

మహారాణిపేట : సంక్రాంతి సంబరాలు సోమవారం 30వ వార్డు సాలిపేటలో వార్డు కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముగ్గులు వేసి, హరిదాసుకు కానుకలు సమర్పించారు. పిండి వంటలు వండి బంధుమిత్రులకు పంచి పెట్టారు. అప్పలరత్నం, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, స్థానికులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.


స్థానికులతో కలిసి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ అప్పలరత్నం

దొండపర్తిలో భజన చెట్టుకు పూజలు

సీతమ్మధార : మంగళవారం జీవీఎంసీ 27వ వార్డు పరిధిలోని దొండపర్తిలో రామాలయం భజన చెట్టు పలు వీధుల్లో తిరిగింది. ఈ సందర్భంగా భక్తులు రాముల వారికి పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. దొండపర్తిలోని కుప్పిలివారివీధి, భాగివారి వీధి, మండావారి వీధి, పాలికలవారి వీధి, నెహ్రూ బజార్ ప్రాంతంలో భజన చెట్టును స్థానికులు దర్శించుకుని రాముల వారికి పూజలు చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

18న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న కోడూరు అప్పలరత్నం

మహారాణిపేట : ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా 30వ వార్డు సచివాలయ (దండుబజార్) టీమును ఆ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం అభినందించారు. ఇటీవల ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో ఈ టీమ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం క్రీడాకారులను కార్పొరేటర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా మకరజ్యోతి పూజలు


విశేష అలంకరణలో శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి


మకరజ్యోతి పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయంలో మకరజ్యోతి పూజలు ఘనంగా నిర్వహించారు. కేరళలో గల శబరిమల అయ్యప్పస్వామి దేవస్థానంలో జ్యోతి దర్శనం సందర్భంగా ప్రతి ఏడాది పూజలు నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా అయ్యప్పస్వామికి విశేష పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు భార్గవశర్మ చేపట్టారు. అయ్యప్పస్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. హారతి జ్యోతిలో అయ్యప్పను దర్శించుకున్న భక్తుల శరణం శరణుగోషతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ బోర్డు చైర్మన్, గురుస్వామి నీలాపు వెంకట రమణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం


హోం మంత్రి తానేటి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సురేష్‌బాబు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమివ్వడం అభినందనీయమని డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూలిడి సురేష్‌బాబు అన్నారు. నగరానికి విచ్చేసిన రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దిశ చట్టం ద్వారా మహిళల్లో ధైర్యం నింపారన్నారు. దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ ఎలా ఉపయోగించాలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సురేష్‌బాబుతోపాటు విజయ్‌కుమార్ ఉన్నారు.

19న 'మా రామయ్య' గీతం విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అభిషేక్ తదితరులు

మద్దిలపాలెం: అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న యూట్యూబ్‌లో అయోధ్యకు వచ్చేనయ్య.. మా రామయ్య గీతాన్ని విడుదల చేయనున్నట్లు యూట్యూబర్ అభిషేక్ తెలిపారు. ప్రస్తుతం విశాఖ పరిసర ప్రాంతాల్లో ఈ పాటను చిత్రీకరిస్తున్నామన్నారు. పెదవాల్తేరు రామలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో మంగళవారం రామయ్య పాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నిమిషాల నిడివి గల ఈ పాటను ఆరిలోవ తోటగరువు కృష్ణుడి మందిరం పరిసరాల్లో చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు. భార్గవ్ మాట్లాడుతూ ఆరవ్ ప్రొడక్షన్ బ్యానర్‌లో తెలుగు, హిందీ భాషల్లో ఈ పాటను విడుదల చేస్తున్నామన్నారు.

లలితా దీక్షలు ప్రారంభం

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో సంక్రాంతి రోజున లలితా దీక్షలు ప్రారంభమయ్యాయి. మాఘ పౌర్ణమి వరకు 21 రోజుల పాటు దీక్ష కొనసాగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యుడు సత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు అమ్మవారి దీక్ష తీసుకున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

- పట్టించుకోని అధికారులు


దొండపర్తిలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు


ఇంటిపై ప్రమాదకరంగా ప్రధాన విద్యుత్ లైన్ తీగలు

సీతమ్మధార : ఇరుకైన రహదారులు, ఇళ్లకు ఆనుకుని విద్యుత్ స్తంభాలు, ఇళ్ల ముందు ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు, వీటికి తోడు ఏ విద్యుత్ స్తంభాన్ని చూసినా కట్టలు కట్టలుగా కేబుల్ వైర్లు వేలాడుతూ కన్పిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని జనం ఆందోళనతో సతమతమవుతున్నారు. జీవీఎంసీ 27వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లు వేలాడుతూ ప్రాణ సంకటంగా మారాయి. ఏదైనా వైర్ షార్ట్ సర్క్యూట్‌కు గురైతే ఏం జరుగుతుందో భయంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మూడడుగుల వెడల్పుతో రహదారులు ఇరుగ్గా ఉంటాయి. దీంతో పాటు ఇక్కడ గోడలకు ఆనుకుని విద్యుత్ స్తంభాలు వేశారు. వాటి నుంచి పదుల సంఖ్యలో సర్వీస్ వైర్లు ఇళ్ల ముందు వేలాడుతున్నాయి. చేయి చాపితే అందే విధంగా వైర్లు ఉంటున్నాయి. జనావాసాల మధ్య కేబుల్, విద్యుత్ వైర్ల వ్యవస్థ తీరు మారాల్సి ఉందని నివాసితులంటున్నారు. విద్యుత్ స్తంభాలకు అనధికారికంగా కేబుల్ వైర్లు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరి చేసి రక్షణ కల్పించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్ ఖాళీ..

- అంతా సొంతూళ్లకు వెళ్లటంతో నిర్మానుష్యం


ఖాళీగా దర్శనమిస్తున్న పండుపుల్లల సందు


జనాలు లేక ఖాళీగా మారిన రామకృష్ణా జంక్షన్


నిర్మానుష్యంగా మారిన వన్‌టౌన్ రహదారి


వెలవెలబోతున్న పూర్ణామార్కెట్


మున్సిపల్ స్టేడియం రోడ్డు ఇలా..

జగదాంబ : వరుస పండగల నేపథ్యంలో పూర్ణామార్కెట్, పరిసర ప్రాంతాలన్నీ ఖాళీగా మారాయి. నగరంలో అత్యంత రద్దీగా ఉండే వాణిజ్య కేంద్రాలైన జగదాంబ, పూర్ణామార్కెట్, వన్‌టౌన్ ప్రాంతాలు సంక్రాంతి, భోగి, కనుక పండగల నేపథ్యంలో అంతా సొంతూళ్లకు వెళ్లిపోవడంతో ఇప్పుడు పూర్తిగా బోసిపోయాయి. వ్యాపారులు కూడా పండగలకు వెళ్లడంతో మార్కెట్ పరిసర ప్రాంతాలైన స్ప్రింగ్‌రోడ్డు, అరటిపండ్ల సందు, పండుపుల్లల సందు, బౌడారారోడు, రామకృష్ణా జంక్షన్ వంటి ప్రాంతాలు నిర్మానుష్యంగా మారిపోయాయి. ఆయా ప్రాంతాల్లోని రహదారులన్నీ జనసంచారం లేక కొత్తగా కనిపించాయి.

సామాన్యుల సేవలో మాస్టర్ ఈకే సంస్కృతి సదన్


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీహెచ్ఎస్ఎన్ రాజు, సత్యదేవ్, బీఆర్‌కే రాజు

మహారాణిపేట : సామాన్యులకు తన వంతు సేవలందించడమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రధాన ఆశయమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురుపీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పేర్కొన్నారు. పీఠం గత ముప్పై సంవత్సరాల నుంచి చేసిన సేవల వివరాలతో కూడిన సావనీర్ (ప్రత్యేక సంచిక)ను అంకోసా ఫంక్షన్ హాల్లో ఆవిష్కరించారు. అనేక ఆధ్యాత్మిక, సేవా సంస్థలకు మార్గదర్శకత్వం వహించిన మాస్టర్ ఈకే, పార్వతీకుమార్ సత్సంకల్పానికి ప్రతిరూపమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ అని ఆయన అన్నారు. 1994లో స్వర్గీయ డాక్టర్ టి.వి.వి.ఎస్.రావు నేతృత్వంలో ఇక్కడ మాస్టర్ హోమియో వైద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు.

1 నుంచి 10వ తరగతి వరకు 444 మందికి ఉచిత విద్యనందించినట్లు తెలిపారు. సంస్కృతీ భవన్ నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, దాతలు, కార్యకర్తలకు సత్యదేవ్ కృతజ్ఞతలు తెలిపారు జగద్గురుపీఠం సలహా మండలి సభ్యులు సి.హెచ్.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ నిస్వార్థ సేవ, ఆధ్యాత్మిక సాధన, త్యాగనిరతి అనేవి తరించడానికి దోహదపడతాయన్నారు. యజ్ఞార్థ జీవనాన్ని మాస్టర్ ఈకే అలవరిచారన్నారు. బాలవికాస కేంద్రంలో 324 మంది చిన్నారులకు ప్రవేశం కల్పించామన్నారు.

సంగీత జనకులం ద్వారా కూడా సేవలందిస్తున్నామని ఆయన చెప్పారు. ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్.మూర్తి, నిర్వాహక సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, యు.సి.హెచ్.బి. వర్మ, సర్కిల్ ఆఫ్ గుడ్ విల్ కార్యనిర్వాహక సభ్యులు జి.వి.ఎన్. హరి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి పౌరాణిక నటుడు అప్పలసూరి


పొన్నాన అప్పలసూరికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న బీవీ అప్పారావు, మళ్ల శ్రీనివాసరావు

మద్దిలపాలెం: ఉత్తమ పద్యనాటక నటుడు, ఆయుర్వేద వైద్యుడు పొన్నాన అప్పలసూరి నేటితరం నటులకు ఆదర్శమని చైతన్య సమితి అధ్యక్షుడు బీవీ అప్పారావు కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస దరి ఎరగాం గ్రామానికి చెందిన డాక్టర్ పొన్నాన అప్పలసూరి 90వ జన్మదిన వేడుకలు ఇసుకతోటలోని ఆయన ఇంట్లో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక నటుల్లో తొలితరానికి చెందిన పి.సూరిబాబు గాత్రాన్ని పోలిన గాత్రంతో అసాధరణ జ్ఞాపకశక్తి, క్రమశిక్షణతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. పొన్నాన అప్పలసూరి కుటుంబ సభ్యుల మధ్య నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఏయూ నాన్‌టీచింగ్ స్టాఫ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గో పూజ


గోవులకు మేత తినిపిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: కనుమ పండగను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పసుపుకుంకుమలు సమర్పించారు. శ్రీకృష్ణుడి విగ్రహం చెంతన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీకృష్ణాష్టకం పఠించి విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం అర్చకుడు సంతోష్‌శర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


గోపూజలో భాగంగా సంప్రదాయ వేషధారణలో గ్రామస్తులు

చినయాతపాలెంలో..

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధి చినయాతపాలెం గ్రామంలో కనుమ పర్వదినాన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం గోపూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వీరాంజనేయ స్వామి ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, సభ్యులు మళ్ల బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధిగా బుద్ధ నరసింహారావు పాల్గొని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చినయాతపాలెంలో గోమాతకు గ్రామస్తులంతా పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో శ్రీరామ నామస్మరణతో అయోధ్య రాముడిని గుర్తు చేస్తూ భక్తులు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో తుంపాల సుగర్స్ మాజీ డైరెక్టర్ మళ్ల కోటేశ్వరరావు, మళ్ల రాము, మళ్ల గంగు నాయుడు, మళ్ల నాగభూషణం, మళ్ల సత్య నారాయణ, బొడ్డేటి కాశీ సూరి అప్పారావు, హరిదాసు వేష ధారణలో అలరించారు. దొడ్డి మహేశ్వరరావు, గంగి రెద్దులు ఆడించే వేషధారి శరగడం రామ కోటి తదితరులు తమ వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

అల్పాహారం పంపిణీ

తాటిచెట్లపాలెం: పైల శివతేజ వర్ధంతి సందర్భంగా పైల శివతేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే న్యూకాలనీ షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం వద్ద అన్నార్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైల దివాకర్ మాట్లాడుతూ తన ఏకైక కుమారుడు పైల శివతేజ ప్రమాదవశాత్తు మరణించి పదేళ్లు పూర్తయిందని, తన జ్ఞాపకార్థం ప్రతి ఏటా జయంతి, వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం, పలువురు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను కూడా అందజేస్తున్నట్లు చెప్పారు.

కనుమ వేళ.. నాన్‌వెజ్‌కు డిమాండ్

- చికెన్, మటన్ దుకాణాలు కిటకిట


నక్కవానిపాలెంలో నాటుకోళ్లు కొనేందుకు వచ్చిన స్థానికులు

సీతమ్మధార: సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. మంగళవారం కనుమ కావడంతో సీతమ్మధార, నక్కవానిపాలెంలోని ప్రధాన రహదారిలో గల నాటుకోడి మాంసం దుకాణాల వద్ద ప్రజలు ఉదయం నుంచి క్యూ కట్టారు. వినియోగదారులు భారీగా వచ్చి కొనుగోలు చేశారు. సంక్రాంతి అనంతరం కనుమ పండగ నాడు.. ప్రతి ఇంట్లో గారెలు, బిర్యాని, నాటుకోడి మాంసంతో బంధుమిత్రులకు భోజనాలు పెడతారు. దీంతో సీతమ్మధారలోని మాంసం దుకాణాలన్నీ జనంతో కిటకిటలాడాయి.

మాజీ సైనికులకు ఘన సత్కారం


ఆర్మీ సైనికులను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో మిలటరీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో పనిచేసిన మాజీ సైనికులను క్లబ్‌కు ఆహ్వానించి వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్వీస్‌లో వారు నేర్చుకున్న క్రమశిక్షణ, నిజాయతీ, దేశభక్తి, వారి అనుభవాలను చక్కగా వివరించారు. దేశం కోసం ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలందించిన సైనికులను సత్కరించుకోవడం మన బాధ్యత అని ప్రభావతి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ గవర్నర్ శుభ, కార్యదర్శి ఎం.జయ, సభ్యులు పాల్గొన్నారు.